క్లుప్తంగా

నకిలీ విలేకరులు హల్‌చల్

జగద్గిరిగుట్ట: జగద్గిరిగుట్ట పోలీస్ స్టేషన్ పరిధిలోని మహాదేవ్‌పురంలో రిజిస్ట్రేషన్ స్థలంలో కొందరు ఇళ్లను నిర్మించుకుంటున్నారు. వారం రోజులులుగా ఆ కాలనీలో జర్నలిస్టులమంటూ కొంత మంది జట్టుగా ఏర్పడి భయభ్రాంతులకు గురి చేస్తున్నారు. రిజిస్ట్రేషన్, పర్మిషన్ కలిగి ఉన్నామని యజమానులు తెలిపినా వినకుండా డబ్బులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. చేసేదేమీ లేక కాలనీ సభ్యులు ఏకమై వారిని పట్టుకొని పోలీస్‌స్టేషన్‌లో అప్పగించారు. పృథ్వీ అనే వ్యక్తిని అదుపులోకి తీసుకోగా మరో ఇద్దరు పరారీలో ఉన్నారని తెలిసింది. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బస్సు ఢీకొట్టడంతో వృద్ధుడి మృతి


దుర్గా మహేశ్వర రావు (ఫైల్)

నిజాంపేట్: బస్సు ఢీకొట్టిన ఘటనలో ఓ రిటైర్డ్ హెడ్‌కానిస్టేబుల్ మృతి చెందిన ఘటన బాచుపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. విజయవాడకు చెందిన రిటైర్డ్ హెడ్‌కానిస్టేబుల్ దుర్గా మహేశ్వరరావు (73) వారం రోజుల క్రితం బాచుపల్లిలోని సిద్ధార్థ నిర్వాణ అపార్ట్‌మెంట్‌లో నివాసముండే తన కుమార్తె లక్ష్మి వద్దకు వచ్చారు. ఆదివారం సాయంత్రం వాకింగ్ నిమిత్తం బయటకు వెళ్లి దుర్గా మహేశ్వరరావు బాచుపల్లి ఇంద్రనగర్ సమీపంలో రోడ్డు దాటుతుండగా వేగంగా వచ్చిన (ఏపీ28టీఏ 4975) నంబరు గల బస్సు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన అతను అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

మద్యం సేవిస్తున్న వ్యక్తి మృతి


గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం

నిజాంపేట్: బాచుపల్లి క్రాస్ రోడ్డులోని శ్రీఆద్య లిక్కర్స్ దుకాణంలో ఇద్దరు వ్యక్తులుఆదివారం సాయంత్రం 4గంటల సమయంలో మద్యం కొనుగోలు చేసి పర్మిట్ రూమ్‌లో మద్యం సేవించారు. ఈ క్రమంలో ఓ వ్యక్తి వెళ్లిపోగా, మద్యం సేవిస్తున్న రెండో వ్యక్తి మత్తులో సొమ్మసిల్లి పడిపోయాడు. అక్కడే ఉన్న ఇతరులు సదరు వ్యక్తిని లేపేందుకు యత్నించగా లేవలేదు. దీంతో వైన్స్ యాజమాన్యం 108కు కాల్ చేయగా పరీక్షించిన సిబ్బంది అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. వైన్స్ దుకాణం మేనేజర్ అశోక్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు బాచుపల్లి పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. సంబంధీకులు ఎవరైనా ఉంటే స్టేషన్‌లో సంప్రదించాలని పోలీసులు కోరారు.

త్రివర్ణ శోభితం

- వాడవాడలా జాతీయ జెండా రెపరెపలు
- ఘనంగా విమోచన, సమైక్యత దినోత్సవం

తెలంగాణ విమోచన, సమైక్యతా దినోత్సవాన్ని ఆదివారం కుత్బుల్లాపూర్ నియోజకవర్గ వ్యాప్తంగా ఘనంగా జరుపుకున్నారు. జాతీయ జెండాలను ఎగురవేసి నిజం నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా పోరాటాలు చేసి అమరులైన వీరులను సేవలను స్మరించుకున్నారు. దేశానికి స్వాతంత్రం వచ్చినా తెలంగాణ ప్రాంతానికి మాత్రం స్వేచ్ఛ రాలేదని, ఆనాడు హోంశాఖ మంత్రి సర్దార్ వల్లభాయ్‌పటేల్ నేతృత్వంలో జరిపిన ఆపరేషన్ పోలోతో తెలంగాణ ప్రజలు దాస్యశృంఖలాల నుంచి విముక్తి పొందారని పలువురు వక్తలు పేర్కొన్నారు. ఆనాడు నిజాంకు వ్యతిరేకంగా పోరాటలు సాగించిన ప్రతి ఒక్కరి ఆశయాల సాధనకు నేటి తెలంగాణ సమాజం కృషి చేయాలన్నారు.

– కుత్బుల్లాపూర్


కొంపల్లి ఎన్సీఎల్ నార్త్ కాలనీలో జాతీయ జెండాలతో చిన్నారులు, బీజేపీ నాయకులు


ప్రగతినగర్‌లో నిజాం విముక్త స్వాతంత్ర్య అమృతోత్సవ సమితి ఆధ్వర్యంలో అమరవీరులకు నివాళులర్పిస్తున్న నాయకులు


షాపూర్‌నగర్ ఉషోదయ టవర్స్ వద్ద జాతీయ జెండాను ఎగురవేసిన బీజేపీ నాయకులు


జాతీయ జెండాను ఎగురవేసి వందనం చేస్తున్న బీజేపీ నేత కూన శ్రీనివాస్‌గౌడ్


గండిమైసమ్మ చౌరస్తాలో జెండాను ఎగుర వేస్తున్న దుండిగల్ బీజేపీ అధ్యక్షుడు మల్లేశ్‌యాదవ్


గాజులరామారం సర్కిల్ కార్యాలయంలో జరిగిన వేడుకల్లో ఉప కమిషనర్ మల్లయ్య

రంగస్థల నాటక పోటీల్లో ఎంఎల్‌ఆర్‌ఐటీ ఫస్ట్


విద్యార్థులకు బహుమతి అందజేస్తున్న గవర్నర్ తమిళిసై సౌందరరాజన్, కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి

దుండిగల్: సెప్టెంబరు 17ను పురస్కరించుకుని సికింద్రాబాద్‌లోని రాష్ట్రపతి నిలయంలో నిర్వహించిన రంగస్థల నాటక పోటీల్లో దుండిగల్ ఎంఎల్‌ఆర్‌ఐటీ కళాశాల విద్యార్థులు ప్రతిభ చాటారు. మూడు రోజుల పాటు జరిగిన పోటీల్లో మొదటి బహుమతిని గెలుచుకున్నారు. ఆదివారం జరిగిన ముగింపు వేడుకలకు ముఖ్యఅతిథులుగా హాజరైన గవర్నర్ తమిళిసై సౌందరరాజన్, కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి చేతుల మీదుగా బహుమతిని అందుకున్నారు. ఈ సందర్భంగా కళాశాల కార్యదర్శి మర్రి రాజశేఖర్‌రెడ్డి, డైరెక్టర్ అనుశ్రేయారెడ్డి, ప్రిన్సిపాల్ డాక్టర్ శ్రీనివాస్‌రావులు హర్షం వ్యక్తం చేశారు. మొదటి బహుమతిని సాధించేందుకు విద్యార్థులతో పాటు కళాశాల ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ నాయిని ఉదయ్‌రంజన్‌గౌడ్, ఫ్యాకల్టీ కోఆర్డినేటర్ వేమూరి నితిన్‌ను అభినందించారు.

ముగిసిన పంచశీల కాలనీ ఎన్నికలు

రంగారెడ్డినగర్: రంగారెడ్డినగర్ డివిజన్ పంచశీల కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడిగా కాప సుబ్బారెడ్డి ఎన్నికయ్యారు. ఆదివారం జరిగిన ఎన్నికల్లో సుబ్బారెడ్డికి 195 ఓట్లు పడగా ఆయన సమీప ప్రత్యర్థి రమణారెడ్డికి 129 ఓట్లు వచ్చాయి. దీంతో 66 ఓట్ల మెజార్టీతో అధ్యక్షుడిగా గెలుపొందారు.

మట్టి గణపతుల విగ్రహాల పంపిణీ





రంగారెడ్డినగర్: మట్టి గణపతులను ప్రతిష్ఠించి వినాయక చవితి పండగను జరుపుకోవాలని రంగారెడ్డినగర్ డివిజన్ బీఆర్‌ఎస్ అధ్యక్షుడు ఏర్వ శంకరయ్య, స్వామి వివేకానంద్ యూత్ అధ్యక్షుడు జల్దా లక్ష్మినాథ్‌లు అన్నారు. ఆదివారం జీహెచ్‌ఎంసీ ఆధ్వర్యంలో రంగారెడ్డినగర్ డివిజన్ పరిధి గాంధీనగర్ వార్డు కార్యాలయంలో మట్టి గణేశ్‌ల విగ్రహాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పీఓపీ విగ్రహాల నిమజ్జనాలతో చెరువులు కలుషితం అవుతున్నాయని, మట్టి గణపతులను ప్రతిష్ఠించే పర్యావరణానికి హితం చేసినవారమవుతామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో యూత్ సభ్యులు మేకల ఎల్లయ్య, శ్రీనివాస్, రాజిరెడ్డి, నీలగిరి, తిమ్మయ్య, విజయ్ తదితరులు పాల్గొన్నారు.

నిజాంపేట్ కార్పొరేషన్‌లో...

నిజాంపేట్: నిజాంపేట్ కార్పొరేషన్ శ్రీసాయినగర్, దేవేందర్‌నగర్, సిద్ధి బ్లాక్, ఆదిత్య గార్డెన్ తదితర ప్రాంతాల్లో ఆదివారం 21వ డివిజన్ కార్పొరేటర్ కాసాని శిరీషముదిరాజ్ ఆధ్వర్యంలో మట్టి గణపతి విగ్రహాల పంపిణీ చేపట్టారు. ఈ కార్యక్రమానికి డివిజన్ బీఆర్‌ఎస్ అధ్యక్షుడు ఎం.డి. జహంగీర్, జలగం చంద్రయ్య, ఎంఏ లతీఫ్, ఎండీ సలీం, భారతి, బొమ్మల పద్మలు పాల్గొని కాలనీవాసులకు విగ్రహాలను అందజేశారు.

నేటి తరం పిల్లల్లో దేశభక్తిని పెంపొందించాలి

కుత్బుల్లాపూర్: పిల్లలకు భారతదేశ సంస్కృతి, సంప్రదాయాలు, నేడు మనం అనుభవిస్తున్న స్వేచ్ఛా స్వాతంత్ర్యాలకు కారణమైన స్వాతంత్ర్య సమరయోధుల జీవిత చరిత్రను తెలియజేసి వారిలో దేశభక్తిని పెంపొందించడమే బాల గోకులం ముఖ్య ఉద్దేశమని నిర్వాహకులు పాత్తూరి మాధురి, ఆర్‌ఎస్ఎస్ బోయిన్‌పల్లి బాగ్ కార్యాలయ ప్రముఖ్ భరత్ అన్నారు. ఆదివారం కొంపల్లి మున్సిపల్ పరిధి ఎన్సీఎల్ నార్త్ కాలనీలో గత సంవత్సరం తెలంగాణ విమోచన దినోత్సవం సందర్భంగా ప్రారంభించిన బాలగోకులం శాఖ ఆదివారంలో సంవత్సరం పూర్తి చేసుకున్న సందర్భంగా పిల్లలకు చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు.

◆ ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. బాల గోకులానికి 1వ తరగతి నుంచి 7వ తరగతి చదువుతున్న 80 నుంచి 100 మంది విద్యార్థులు వస్తున్నారని అన్నారు. ప్రతి ఆదివారం వారికి యోగా, వ్యాయామం, క్రీడలతో పాటు మహాభారతం, రామాయణం వంటి ఇతిహాసాలను బోధిస్తూ వారు సన్మార్గంలో పయనించేలా కృషి చేస్తున్నామని తెలిపారు. గత సంవత్సరం కాలంగా బాలాగోకులంలో పిల్లలు నేర్చుకున్న యోగాసనలు ఇంట్లో రోజూ చేయడంతో వారు స్మార్ట్ ఫోన్‌లకు దూరంగా ఉంటున్నారన్నారు. వినాయక చవితిని పురస్కరించుకుని పిల్లలతో మట్టి గణపతుల విగ్రహాలను తయారు చేయించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు పాత్తూరి శివాజీ రాజు, కాలనీ వాసులు వినయ్‌రెడ్డి, కిరణ్ కుమార్, శ్రీనివాస్‌రెడ్డి, వెంకటపతి రాజు తదితరులు పాల్గొన్నారు.

భారత స్వచ్ఛత లీగ్ పోస్టర్ ఆవిష్కరణ

నిజాంపేట్: నిజాంపేట్ కార్పొరేషన్‌ను స్వచ్ఛతకు మారుపేరుగా తీర్చిదిద్దుతామని మేయర్ కొలన్ నీలారెడ్డి అన్నారు. ఆదివారం శ్రీరామ్‌కుంట వద్ద భారత స్వచ్ఛత లీగ్ 2.0 పోస్టర్‌ను ఆమె ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నీలారెడ్డి మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని, ప్లాస్టిక్ కవర్లకు బదులుగా బట్ట, జూట్ సంచులను వాడాలన్నారు. ఇళ్లలోని తడి, పొడి చెత్తను వేరు చేసి చెత్త సేకరణ ఆటోరిక్షాలకు అందించాలన్నారు. పర్యావరణ పరిరక్షణ కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని మేయర్ పిలుపునిచ్చారు.

నంబర్ ప్లేట్ లేని వాహనాలపై కొరడా

చలాన్ విధించి.. నంబర్ ప్లేట్‌లను బిగించిన పోలీసులు

కుత్బుల్లాపూర్: నంబర్ ప్లేట్ లేకుండా తిరిగే వాహనాలపై అల్వాల్ ట్రాఫిక్ పోలీసులు స్పెషల్ ఫోకస్ పెట్టారు. సీఐ నాగేశ్వరరావు ఆధ్వర్యంలో ఎస్సై శ్యాంబాబు సిబ్బందితో కలిసి సుచిత్ర చౌరస్తా మూలమలుపు వద్ద ఆదివారం తనిఖీలు నిర్వహించి వాహనదారులకు అవగాహన కల్పించారు. నంబర్ ప్లేట్ లేకుండా తిరుగుతున్న వాహనాలపై రూ. 200 ఫైన్ విధించి అప్పటికప్పుడే నంబర్ ప్లేట్ తయారు చేయించి బిగించడం విశేషం. మరికొన్ని కార్లు, ద్విచక్ర వాహనాలపై నిబంధనలకు విరుద్ధంగా నంబర్ ప్లేట్లు ఉండడంపై ఫైన్ లు వేశారు. ఈ సందర్భంగా సిఐ నాగేశ్వరరావు ‘సాక్షి’తో మాట్లాడుతూ... ప్రతి ఒక్కరూ నిబంధనలు పాటించాలని, సుచిత్ర నుంచి బోయినపల్లి, కొంపల్లి వరకు ఫ్లైఓవర్ పనులు జరుగుతున్న నేపథ్యంలో వాహనదారులు అడ్డదిడ్డంగా వెళ్లకుండా నిర్దేశించిన మార్గంలోనే వెళ్లాలని కోరారు. కొంతమంది రోడ్డుకు అడ్డంగా వెళ్లడం మూలంగా ఇతర వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. అల్వాల్ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ పరిధిలోని వివిధ ప్రాంతాల్లో ప్రతిరోజు ప్రధాన చౌరస్తాల వద్ద ఆకస్మిక తనిఖీలు చేపట్టి నిబంధనలకు విరుద్ధంగా తిరుగుతున్న వాహనాలను గుర్తించి వాటికి ఫైన్లు వేస్తున్నట్లు పేర్కొన్నారు.

గణేశ్ చవితి శోభ


విక్రయానికి ఉంచిన గణేశ్ లడ్డూలు

వినాయక చవితి పండుగను పురస్కరించుకుని ప్రధాన మార్కెట్లు జనంతో కిటకిటలాడాయి.. షాపూర్‌నగర్, సుచిత్ర, జగద్గిరిగుట్ట, జీడిమెట్ల, కుత్బుల్లాపూర్ సర్కిల్ చౌరస్తా ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన విగ్రహాల కొనుగోలు దుకాణాలు, పూలు, పండ్లు, వినాయక పత్రిని కొనుగోలు చేసేందుకు వచ్చిన జనంతో రద్దీగా మారాయి. అదే విధంగా స్వీట్ దుకాణాల్లో గణేశ్ లడ్డులను కొనుగోలు చేసేందుకు భక్తులు క్యూ కట్టారు. దీంతో ఒక రోజు ముందే వినాయక చవితి పండుగ వాతావరణం సంతరించుకుంది.

– సుభాష్‌నగర్


జనంతో కిక్కిరిసిన షాపూర్‌నగర్ మార్కెట్..


సుచిత్రలో విక్రయానికి ఉంచిన గణపతి పూజ పత్రి, టెంకాయలు


షాపూర్‌నగర్ ప్రధాన రోడ్డు వెంబడి ఫుట్‌పాత్‌పై వెలిసిన పూల దుకాణాలు

వైభవంగా విశ్వకర్మ జయంతి


రావినారాయణరెడ్డినగర్‌లోని గాలిపోచమ్మ ఆలయంలో జరిగిన విశ్వకర్మ జయంతిలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే శ్రీశైలంగౌడ్


విశ్వకర్మ యజ్ఞ పూజలో పాల్గొన్న ఎమ్మెల్యే వివేకానంద్


జగద్గిరిగుట్ట లక్ష్మీవేంకటేశ్వరస్వామి ఆలయం వద్ద విశ్వకర్మ జయంతి బైక్ ర్యాలీని ప్రారంభిస్తున్న కార్పొరేటర్ జగన్


భౌరంపేట్‌లో జరిగిన విశ్వకర్మ జయంతిలో రాష్ట్ర బీజేపీ మాజీ ఉపాధ్యక్షుడు మల్లారెడ్డి


శ్రీనివాస్‌రెడ్డిని సత్కరిస్తున్న విశ్వకర్మ సేవా సంఘం అధ్యక్షుడు కృష్ణమాచారి

కుత్బుల్లాపూర్/దుండిగల్: కుత్బుల్లాపూర్ నియోజకవర్గ వ్యాప్తంగా ఆదివారం విరాట్ విశ్వకర్మ భగవాన్ జయంతి వేడుకలు వైభవంగా జరిగాయి. ఈ సందర్భంగా పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయాలు, ఇతర దేవాలయాల్లో విశ్వకర్మ యజ్ఞ పూజను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. సూరారం విశ్వకర్మ కాలనీలో విశ్వకర్మ పూజ, అన్నదాన కార్యక్రమాలను శ్రీ విశ్వకర్మ సేవా సంఘం అధ్యక్షుడు పోలిగరం కృష్ణమాచారి, వర్కింగ్ ప్రెసిడెంట్ కమ్మరి లక్ష్మణాచారి ల అధ్వర్యంలో నిర్వహించారు. ఈ పూజలో కాలనీ అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఈ జయంతి వేడుకల్లో కాలనీ ప్రధాన కార్యదర్శి సద్దానందం, నర్సింహ, వాసు గుప్తా, విశ్వకర్మ సంఘం సభ్యులు కిరణ్‌కుమార్‌చారి, రామాచారి, పురుషోత్తమ్‌చారి, సోమాచారి, కిషోర్ చారి, సుబ్రహ్మణ్యంచారి, బీజేపీ నాయకులు వెంకటేష్, ప్రభాకర్ రెడ్డి, కమ్మరి రమేష్, వడ్ల అంజనేయులు, విగ్నేష్, పిసరి కృష్ణారెడ్డి, గోన మల్లారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

◆ గాజులరామారం డివిజన్ రావినారాయణరెడ్డినగర్‌లోని గాలి పోచమ్మ ఆలయ ప్రాంగణంలో విశ్వబ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన యజ్ఞ మహోత్సవానికి మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలంగౌడ్ హాజరై స్వామి వారికి ప్రత్యేక పూజలు చేశారు.

◆ జీడిమెట్ల గ్రామం, ఐడీపీఎల్, దేవేందర్ నగర్‌లలో జరిగిన వేడుకల్లో ఎమ్మెల్యే వివేకానంద్ పాల్గొన్నారు.

◆ జగద్గిరిగుట్టలోని లక్ష్మీవేంకటేశ్వరస్వామి కొండపై వెలసిన పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయంలో విశ్వకర్మ జయంతిని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు.

◆ విశ్వకర్మ జయంతి బైక్ ర్యాలీని కార్పొరేటర్ జగన్ ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు.

దుండిగల్ మున్సిపల్ పరిధిలోని భౌరంపేట్‌లో జరిగిన విశ్వకర్మ పూజలో రాష్ట్ర బీజేపీ మాజీ ఉపాధ్యక్షుడు డాక్టర్ ఎస్.మల్లారెడ్డి పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు.